అక్షరశక్తి
The Power of Pen
Evening Daily
సంపుటి: 20 | సంచిక: 295 | వరంగల్ | శుక్రవారం, 28 ఆగస్టు 2026 | పేజీలు: 6



# కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

## సెప్టెంబర్ 2నుంచి నిరసన కార్యక్రమాలు

- ఏడు రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను జనంలో ఎండగట్టడమే లక్ష్యం
- పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలి
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్

కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల అసమర్థ పాలన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, అవినీతి ఆరోపణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి చేపట్టనున్న వారం రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి వరుసగా ఏడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచాలని ఆయన సూచించారు. - అక్షరశక్తి, హైదరాబాద్

6



# రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన సురేఖ

- రాఖీతో రాజీ కుదిరేనా?
- పండగ సందర్భంగా అనూహ్య ఘటన
- గతంలోనూ రాఖీ కట్టిన సురేఖ
- తాజా రాజకీయ పరిణామాలపై ఆసక్తికర చర్చ

3



## బషీర్బాగ్ అమరుల త్యాగఫలితమే ఉచిత విద్యుత్



**అక్షరశక్తి, తొర్రూర్ :** తెలంగాణ రాష్ట్రంలో పేద సామాన్య మధ్యతరగతి ప్రజానీకానికి అందుతున్న ఉచిత విద్యుత్ నాటి బషీర్ బాగ్ అమరవీరుల త్యాగ ఫలితమేనని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. బషీర్బాగ్ విద్యుత్ అమరవీరుల 26వ వర్ధంతి సందర్భంగా నేడు తొర్రూరులోని బస్టాండ్ వద్ద విష్ణువర్ధన్, రామకృష్ణ, బాలస్వామిలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ... ప్రపంచ బ్యాంకు అనుకూల సంస్కరణలు అమలు చేస్తున్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు మూడు నెలలు దశలవారీగా దీర్ఘకాలిక మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను కాదని పెట్టుబడిదారుల అనుకూల సంస్కరణలు అమలు చేసిన నాటి ప్రభుత్వం పై తెలుగు ప్రజలు చారిత్రాత్మక పోరాటం నడిపారని అన్నారు. నేడు రాష్ట్రంలోని కాంగ్రెస్ కేంద్రంలోని బిజెపి సామ్రాజ్యవాద, గుత్త పెట్టుబడిదారులకు అనుకూల విధానాలను ప్రజలపై రుద్దుతున్నారని అన్నారు. ఎంతో ఘనమైన పోరాట చరిత్ర గలిగిన ప్రజలు మొరోసారి ఉద్యమించటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముందంపల్లి వీరన్న మాట్లాడుతూ ఉచిత కరెంటు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతాంగానికి 24 గంటల కరెంటు ఇవ్వడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమించాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో మల్లికంటి వెంకన్న పుల్లయ్య బాలు ప్రసాద్ వెంకన్న మహేందర్ మురళి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు



**అక్షరశక్తి, హైదరాబాద్:** మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, వారి కుటుంబ సభ్యులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి సీతక్క రాఖీ కట్టి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా కమిషన్ చైర్మన్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మేకలు, గొర్రెల అభివృద్ధి సహకార చైర్మన్ సరిత తిరుపతయ్య యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు మంత్రి పొన్నంకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాఖీలు కట్టిన సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాఖీ పౌర్ణమి పండుగ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

## సీఎం రేవంత్‌కు రాఖీ కట్టిన ఎర్రబెల్లి స్వర్ణ



**అక్షరశక్తి, హైదరాబాద్:** రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఈరోజు ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆడబిడ్డలకు అన్నగా, వారి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఆయన ఆయురారోగ్యాలతో, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ రాఖీ కట్టడం చాలా సంతోషంగా ఉందని అని తెలిపారు.

# ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు

- **ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్**
- **ఉద్యోగుల పనితీరును**





**అక్షరశక్తి, హనుమకొండ:** వినియోగదారులకు మరింత నాణ్యమైన, విశ్వసనీయమైన విద్యుత్ సేవలను అందించడంతో పాటు సంస్థ పనితీరును మరింత మెరుగుపరచేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొనగా, హన్మకొండ నక్కలగుట్టలో ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధ్యక్షతన డైరెక్టర్లు,చీఫ్ ఇంజనీర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వివరించారు.

ఎన్‌పీడీసీఎల్‌లోని సెక్షన్ల పనితీరును మరింత పారదర్శకంగా కొలిచే విధంగా అంచనా వేయడానికి 100 మార్కుల ఆధారిత ఉద్యోగుల పనితీరు నిర్వహణ వ్యవస్థ అమలు చేస్తున్నామని వివరించారు. సంస్థ ప్రాధాన్యతలకు అనుగుణంగా వివిధ అంశాలకు మార్కులు కేటాయించి, వాటి ఆధారంగా సెక్షన్లకు ర్యాంకులు, గ్రేడ్లు నిర్ణయిస్తున్నామని చెప్పారు. కొత్త సర్వీసుల విడుదల, రెవెన్యూ వసూళ్లు, పెండింగ్ వర్క్ ఆర్డర్ల ముగింపు, ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాల నియంత్రణ, ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, ఎనర్జీ ఆడిట్ నష్టాల తగ్గింపు, సైది, సైఫీ, నిలిపివేతకు సంబంధించిన తనిఖీలు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం, కాలిపోయిన పని చేయని మీటర్ల మార్పిడి, బిల్‌స్టాప్ తనిఖీలు వంటి అంశాలను పనితీరు అంచనాలో పరిగణనలోకి తీసుకుంటున్నామని,

పనితీరు అంచనాలో ప్రస్తుత ఫలితాలతో పాటు





గత నెలతో పోలిస్తే సాధించిన పురోగతికి కూడా అదనపు మార్కులు ఇవ్వడం ఈ విధానంలో ప్రత్యేకత అన్నారు. దీంతో వెనుకబడిన సెక్షన్లు కూడా తమ పనితీరును క్రమంగా మెరుగుపరుచుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు.

ఉద్యోగులు తమ ర్యాంకు స్కోర్ గ్రేడ్‌తో పాటు ఏ అంశంలో మార్కులు తగ్గాయో, గత నెలలతో పోలిస్తే పనితీరు ఎలా ఉందో తెలుసుకునే విధంగా ఉద్యోగుల పనితీరు మూల్యాంకన డ్యాష్‌బోర్డ్ అందుబాటులో ఉందని, తద్వారా బలహీనంగా ఉన్న అంశాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ర్యాంకు సాధించే అవకాశం కల్పిస్తున్నామని వ్యక్తం చేశారు. అకౌంట్స్, రెవెన్యూ ,టెక్నికల్, ఆపరేషన్ ,నిర్వహణ, సేఫ్టీ, స్టోర్స్, కమర్షియల్, బెస్ట్ ప్రాక్టీసెస్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, సివిల్ విభాగాలకు శిక్షణా కార్యక్రమాలను రూపొందించామన్నారు.

క్వాలిటీ కంట్రోల్ విభాగం ద్వారా క్షేత్రస్థాయిలో చేపట్టిన విద్యుత్ పనుల నాణ్యతను నిరంతరం తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఎర్తింగ్, జంపర్ బైండింగ్, ఫ్యూజ్ వైర్ తదితర పునరావృత లోపాలను తగ్గించేందుకు కామన్ ఫీల్డ్ చెక్‌లిస్ట్ విధానాన్ని అమలు చేయాలని సీఎండీ ప్రతిపాదించారు.

ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ ఉద్యోగుల పనితీరు మెరుగుదల, క్షేత్రస్థాయి పనుల నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వినియోగదారులకు పారదర్శక సేవలు ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి అంశాలను సమన్వయం చేస్తూ విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సాంకేతికంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడం ద్వారా మెరుగైన విద్యుత్ సేవలు వినియోగదారులకు అందుతున్నాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్, సిఈలు: సురేందర్, నాగ ప్రసాద్, గౌతమ్ రెడ్డి, సీజియంలు చరణ్ దాస్, కిషన్, వేణు బాబు, జియంలు కళాధర్ రెడ్డి, వాసుదేవ్, విజయేందర్ రెడ్డి , మల్లికార్జున్, గోపికృష్ణ, తిరుపతి డి.ఈ కె. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ

- **మెప్సన్, న్యూ విజన్ డయాగ్నస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించిన కలెక్టర్**



**అక్షరశక్తి, హనుమకొండ:** స్కానింగ్ , డయాగ్నొస్టిక్ సెంటర్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాకాజీ కాలనీ లోని మెప్సన్ డయాగ్నస్టిక్ సెంటర్, న్యూ విజన్ దయాగ్నస్టిక్ సెంటర్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మెప్సన్ దయాగ్నస్టిక్ సెంటర్ ను తనిఖీ చేసిన కలెక్టర్ అందులోని అల్ట్రా సౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ గదులను పరిశీలించారు. దయాగ్నస్టిక్ సెంటర్ లో స్కానింగ్ ల వివరాలను స్కానింగ్ కేంద్రం ప్రతినిధులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ స్కానింగ్ కేంద్రంలో వివిధ రకాల స్కానింగ్ పరీక్షలకు సంబంధించిన ధరల వివరాలను తెలిపే పట్టిక కింద పెట్టి ఉండటంతో స్కానింగ్ కేంద్రం ప్రతినిధులను కలెక్టర్ ప్రశ్నించారు. స్కానింగ్ పరీక్షల ధరలు పట్టికను స్కానింగ్ కోసం వచ్చే ప్రజలకు స్పష్టంగా తెలిసేలా నిబంధనల మేరకు పెట్టించాలన్నారు. అదేవిధంగా న్యూ విజన్ దయాగ్నస్టిక్స్ సెంటర్ ను తనిఖీ సందర్భంగా తాళం వేసి ఉండటంతో అక్కడి అండర్ గ్రౌండ్ (సెల్లార్) ను పరిశీలించారు. ఈ రెండు దయాగ్నస్టిక్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు బిల్డింగ్ ప్లాన్ ప్రకారం పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను దయాగ్నస్టిక్ కు ఉపయోగిస్తుండడంతో నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్యను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పార్కింగ్ కోసం అనుమతించిన ప్రదేశాలను ఎవరు కూడా ఇతర అవసరాలకు వినియోగించకూడదన్నారు. ధరల పట్టికను మరియు సేవలందిస్తున్న డాక్టర్ ల వివరాలను ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు.



ప్రతి క్లినిక్ ,ఆసుపత్రి డయాగ్నొస్టిక్ సెంటర్లు, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ,పిసిపిఎన్డిటి చట్టం నియమాలను పాటించడంతో పాటుగా బయోమెడికల్ , మరియు కాలుష్య నియంత్రణ మండలి నియమాలను అనుసరించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య కాకతీయ కిడ్నీ సెంటర్, సిద్ధార్థ కార్డియాక్ సెంటర్,వినోద డెంటల్ , మల్లిక చిల్డ్రన్స్ హాస్పిటల్ లను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ప్రదేశాన్ని మెడికల్ షాప్ ,మరియు ఇతర అవసరాలకు వినియోగిస్తున్న ఆసుపత్రులకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన తెలియజేశారు.

# రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన సురేఖ

- రాఖీతో రాజీ కుదిరేనా?
- పండగ సందర్భంగా అనూహ్య ఘటన
- గతంలోనూ రాఖీ కట్టిన సురేఖ
- తాజా రాజకీయ పరిణామాలపై ఆసక్తికర చర్చ



**అక్షరశక్తి, హైదరాబాద్:** రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ రాఖీ కట్టారు. శుక్రవారం ఉదయం మంత్రులు సీతక్క, కొండా సురేఖ సీఎంను కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ఇద్దరు మంత్రులు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ కి మంత్రి కొండా సురేఖ ప్రత్యేకంగా చేయించిన బంగారు రాఖీని కట్టారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సీఎంకు రాఖీ కట్టినట్లు ఆమె తెలిపారు. సీఎం కోసం ప్రత్యేకంగా బంగారు రాఖీ చేయించినట్లు చెప్పారు. రాఖీ కట్టిన అనంతరం కొండా సురేఖ ఆయన నివాసం నుంచి వెంటనే వెనుదిరిగారు. అంతకు ముందు ముఖ్యమంత్రికి రాఖీ కట్టిన మంత్రి సీతక్క కూడా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఈ పరిణామాలకు రాజకీయాల్లో ఆసక్తికర చర్చ సాగుతున్నది. గత పది రోజులుగా సాగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్ ఈ రాఖీ తో పోతుందని చర్చ సాగుతున్నది. కొండా సుస్మితా పటేల్ చేసిన



ఆరోపణలకు సీరియస్ అయిన కాంగ్రెస్ అధిష్టానం చర్యలు తీసుకుంటుంది అనే సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి కి, సురేఖకు మధ్య విభేదాలు వచ్చాయని, ఆమెను మంత్రి పదవి నుండి తొలగిస్తారని వార్తలు వెలువడ్డాయి. కానీ ఈ రోజు రేవంత్ కుటుంబ సభ్యుల మధ్య రేవంత్ రెడ్డికి రాఖీ కట్టడం సమస్యలు తొలగిపోయాయి అనే సంకేతాలు ఇస్తున్నారని కొందరు అంటున్నారు.

కానీ సురేఖ గతంలో కూడా సంప్రదాయం ప్రకారం రేవంత్ కు రాఖీ కట్టిందని, అధిష్టానం మాత్రం ఆమెపై చర్యలు తీసుకోవడం ఖాయం అని మరో వర్గం అంటుంది. ఈ రాఖీ పండగ వేళ కొండా సమస్య టీ కప్పులో తుఫానులా మిగిలిపోతుందా? లేక వేటు ఖాయమా అనేది మరి కొద్ది రోజుల్లో తేలిపోనుంది.

# నేపాల్ విపత్తుపై కేంద్ర విదేశాంగ మంత్రికి ఎంపీ కావ్య లేఖ

**అక్షరశక్తి, వరంగల్ :** నేపాల్‌లో సంభవించిన విపత్తు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రనికి చెందిన పలువురు గాయపడటం, కొందరు మృతి చెందడం, మరికొందరు గల్లంతైన నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు లేఖ పంపించారు. బాధితుల పరిస్థితి, వారి కుటుంబాల ఆందోళనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం, సంబంధిత కాన్సులర్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం, అవసరమైన చికిత్స, ఆసుపత్రి సదుపాయాలు, మందులు తదితర అత్యవసర సహాయాన్ని అందించాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు. అలాగే విపత్తులో మృతి చెందిన వారి మృతదేహాలను గుర్తించి, అవసరమైన అధికారిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి, భద్రంగా స్వదేశానికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు చేర్చే వరకు బాధిత కుటుంబాలకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.



ఇప్పటికీ ఆచూకీ తెలియని తెలంగాణకు చెందిన వారి కోసం నేపాల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ శోధన, సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. భారత రాయబార కార్యాలయం, నేపాల్ స్థానిక అధికారులు, రెస్క్యూ బృందాలు, సంబంధిత ఏజెన్సీలు గల్లంతైన వారి కుటుంబాలతో నిరంతరం సమన్వయం చేసుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర విదేశాంగ మంత్రి శ్రీ ఎస్. జైశంకర్ గారికి లేఖ పంపిన అనంతరం కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం ఉన్నతాధికారులతోనూ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితుల వివరాలు, సహాయక చర్యలు, గల్లంతైన వారి ఆచూకీ, మృతదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నందున వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, ప్రతి ఒక్కరి ఆచూకీ కోసం అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

**"ప్రతి బాధితుడికి అండగా నిలవాలి"**

నేపాల్‌లో చిక్కుకున్న లేదా విపత్తు ప్రభావానికి గురైన తెలంగాణ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా కేంద్ర ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. గాయపడిన వారికి వైద్యం, మృతుల మృతదేహాలను స్వదేశానికి తరలించడం, గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఎంపీ డా.కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు రాఖీలు కట్టిన మహిళా నేతలు

అక్షరశక్తి, హన్మకొండ : హన్మకొండ సుబేదారిలోని వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి సంబరాలు జరిగాయి. వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజుకు పలువురు మహిళా నాయకులు రాఖీలు కట్టారు. నియోజకర్గవం నుండి వివిధ ప్రాంతాలు నుంచి తరలివచ్చిన మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పార్టీ కార్యాలయంలో సందడి నెలకొంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా తరలివచ్చిన పార్టీ మహిళా నేతలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజుకు రాఖీలు కట్టి స్వీట్లు కూడా తినిపించి తమ అభిమానాన్ని



చాటుకున్నారు. తనకు ఆప్యాయంగా రాఖీలు కట్టిన మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. వారికి బహుమతిగా చీరలను అందజేశారు. వారితో కాసేపు ఆత్మీయంగా మాట్లాడి, కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు. నియో



జకవర్గంలోని ప్రతి అక్కాచెల్లెమ్మ ఆనందంగా, సురక్షితంగా ఉండాలని, వారి కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే నాగరాజు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



# నవజాత శిశు, మాతృ మరణాల అదుపే లక్ష్యం

**పీడియాట్రిక్ వైద్య నిపుణులు**

**అక్షరశక్తి, వరంగల్:** నవజాత శిశువులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతోపాటు శిశు మరియు మాతృ మరణాల రేటును గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా వరంగల్‌లో 'సెంట్రల్ జోన్ పీడియాట్రిక్స్ కాన్ఫరెన్స్' ప్రారంభమైంది. కాన్ఫరెన్స్ వర్క్‌షాప్ చైర్మన్ డాక్టర్ బలరామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో యంగ్ డాక్టర్లకు ఆరు కీలక అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో శిశువులకు అందించాల్సిన వైద్యం, ఆధునిక చికిత్సా విధానాలపై నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐఏపీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులు డాక్టర్ బి. సుగుణాకర్ రెడ్డి, డాక్టర్ కె. రాజశేఖర్ రావు, డాక్టర్ కె. వెంకటేశ్వర్ రావు, డాక్టర్ ఎం. శేషు మాధవ్, అలాగే పీఏటీఎస్ ప్రతినిధులు డాక్టర్ గుడూరు విజయ్ కుమార్, డాక్టర్ ఎస్. కృష్ణమూర్తి, డాక్టర్ సుంకోజ్ భాస్కర్, డాక్టర్ ఎన్.ఎల్. శ్రీధర్, డాక్టర్ శ్రీకృష్ణ ఆర్ఎస్వీ తదితరులు మాట్లాడారు. అత్యవసర వెంటిలేషన్, పాయింట్ ఆఫ్ కేర్ అల్ట్రాసౌండ్, చిన్నారుల్లో పోషకాహార లోపాల నివారణ, అలర్జీల చికిత్స, చిన్నారులపై జరుగుతున్న హింసను అరికట్టడం వంటి అంశాలపై వైద్యులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐఏపీ ప్రెసిడెన్షియల్ యాక్షన్ ప్లాన్-2026లో భాగంగా బాలల ఆరోగ్య సంరక్షణకు మరింత ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే వరంగల్ పీడియాట్రిక్ సొసైటీ నాయకులు డాక్టర్ జి. రమేష్, డాక్టర్ పి. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. 2030 నాటికి నిర్దేశించుకున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ) మేరకు శిశు, మాతృ మరణాలను గణనీయంగా తగ్గించడం, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు.

# ఆగస్టు 31 నుంచి ఎంబీఏలో స్పాట్ అడ్మిషన్లు

**అక్షరశక్తి, హన్మకొండ:** కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి MBA కోర్సులో స్పాట్ అడ్మిషన్లు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3, 2026 వరకు విద్యారణ్యపురి, హన్మకొండలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. నరసింహాచారి తెలిపారు. TG ICET-2026లో అర్హత సాధించిన అభ్యర్థులతో పాటు, అర్హత సాధించని అభ్యర్థులు కూడా స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాలతో పాటు, అవసరమైన ఫీజును వెంట తీసుకురావాలని సూచించారు. అయితే, స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని ప్రొఫెసర్ ఎస్. నరసింహాచారి స్పష్టం చేశారు. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలు TG ICET అధికారిక వెబ్‌సైట్‌తో పాటు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ నోటీసు బోర్డులో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ ఎస్. నరసింహాచారి కోరారు.



# మానసిక దివ్యాంగ చిన్నారులతో రాఖీ పండుగ వేడుకలు

### ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆప్యాయంగా రాఖీలు కట్టిన చిన్నారులు



**అక్షరశక్తి, హన్మకొండ:** సోదర సోదరీమణుల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ వేడుకలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హన్మకొండ కనకదుర్గ కాలనీలోని తమ నివాసంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం మానసిక దివ్యాంగ చిన్నారుల సమక్షంలో అత్యంత వైభవంగా, ఆత్మీయ వాతావరణంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మల్లికాంబ మనోవికాస కేంద్రం నుండి వచ్చిన మానసిక దివ్యాంగ చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రాఖీలు కట్టారు. పిల్లలు చూపించిన స్వచ్ఛమైన ఆప్యాయతకు ఎంపీ, ఎమ్మెల్యే లు ఇద్దరూ ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. రాఖీలు కట్టిన చిన్నారులకు ఎంపీ, ఎమ్మెల్యేలు స్వయంగా మిఠాయిలు తినిపించి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో కాసేపు సరదాగా మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగ పిల్లల సంక్షేమానికి, మల్లికాంబ మనోవికాస కేంద్రం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ వేడుకల్లో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు, ప్రతినిధులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**అక్షరశక్తి,హనుమకొండ:** జిల్లా కలెక్టరేట్ లో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కి సుబేదారిలోని బాలసదన్ బాలికలు రాఖీ కట్టారు. రాఖీ పర్వదిన ప్రాముఖ్యతను జిల్లా కలెక్టర్ వివరిస్తూ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు, ఆప్యాయతకు అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని వివరించారు. బాల సదన్ బాలికలకు రక్షణగా నిలబడాలని తెలిపారు. ఈ వేడుకలలో బాలికలకు కలెక్టర్ రాఖీ కట్టారు. రక్షాబంధన్ రోజున తనకు రాఖీని కట్టిన బాలికలకు జిల్లా కలెక్టర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాఖీ పర్వదిన సందర్భంగా జిల్లా కలెక్టర్ తో కలిసి వేడుకలు జరుపుకోవడం పట్ల బాలికలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, బాల సదన్ సూపరింటెండెంట్ కళ్యాణి, బాల సదన్ బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సోమిడి కల్వర్టు పనుల్లో జాప్యం

**అక్షరశక్తి,కాజీపేట:** కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో కల్వర్టు పనులు మూడు నెలలుగా కొనసాగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి మూసివేయడంతో చిన్న గల్లీల్లో భారీ వాహనాలు తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోచమ్మ పండుగలోగా పనులు పూర్తి చేయకపోతే రాజకీయాలకు అతీతంగా ఆందోళన చేపడతామని, అవసరమైతే నిరసన దీక్షకు దిగుతామని సోమిడి వాసులు హెచ్చరించారు.+++++



# గ్రామీణ నేపథ్యం నుంచి ఒలింపిక్ కల వరకు..

### తైక్వాండోలో ద్వారక రెడ్డి ప్రస్థానం

**అక్షరశక్తి,ప్రధానప్రతినిధి:** గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాకారుడిగా ఎదుగుతూ, భవిష్యత్తులో ఒలింపిక్ పతకం సాధించాలనే ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు ములుగు జిల్లా దేవగిరిపట్నం గ్రామానికి చెందిన ఎస్. ద్వారక రెడ్డి. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న ద్వారక రెడ్డి వ్యవసాయ ఆధారిత కుటుంబానికి చెందినవాడు. తండ్రి సంజీవ్ రెడ్డి సాధారణ రైతు. గ్రామీణ రైతు కుటుంబం నుంచి వచ్చినప్పటికీ క్రీడపై ఉన్న ఆసక్తి, క్రమశిక్షణ, పట్టుదలతో తైక్వాండోలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు.

**ఆటే ప్రాణం....**

ద్వారక రెడ్డి ఆరో తరగతిలో తైక్వాండోను ఎంచుకున్నాడు. 2021లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేరిన తర్వాత అతని ఆటపై ఉన్న మక్కువ వల్ల క్రీడా ప్రతిభకు మరింత ప్రోత్సాహం లభించింది. కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలను సాధించాడు. 2022లో జరిగిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ రాష్ట్ర క్రీడా పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన అతను, 2023లో జరిగిన మూడో ఏకలవ్య జాతీయ క్రీడా పోటీల సబ్‌జూనియర్ విభాగంలోనూ స్వర్ణ పతకం సాధించాడు. అదే ఏడాది జరిగిన తొలి తెలంగాణ అంతర్‌జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించి ప్రతిభ చాటాడు.

**జాతీయ స్థాయిలో....**

తైక్వాండోలో జాతీయ స్థాయిలోనూ తన సత్తా చాటిన ద్వారక రెడ్డి 2023లో మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన ఇండియన్ ర్యాంకింగ్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో ఐదో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించాడు. 2024లో జరిగిన ఆరో తెలంగాణ అంతర్‌జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం, 12వ తెలంగాణ అంతర్ పాఠశాల తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించాడు. 2025లో మహారాష్ట్రలో జరిగిన సీబీఎస్ఈ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో, తమిళనాడులోని సేలంలో జరిగిన 13వ ఓపెన్ జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాలు సాధించాడు. అదే ఏడాది సీబీఎస్ఈ జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాడు.

2026లో గచ్చిబౌలిలో జరిగిన రెండో జాతీయ కప్ తైక్వాండో పోటీల్లో స్వర్ణ పతకం సాధించడం ద్వారక రెడ్డి ఖాతాలో మరో కీలక విజయంగా నిలిచింది.







అదే ఏడాది ఒడిశాలో జరిగిన తొలి యూత్ జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాడు. మహారాష్ట్రలోని పుణెలో జరిగిన జాతీయ జూనియర్, క్యాడెట్, సీనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లలోనూ పాల్గొని జాతీయ స్థాయిలో అనుభవాన్ని సొంతం చేసుకున్నాడు.

**సాహస క్రీడల్లోనూ ప్రతిభ...**

క్రీడలతో పాటు సాహస కార్యక్రమాల్లోనూ ద్వారక రెడ్డి తన ప్రతిభను చాటుకున్నాడు. మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వరకు ప్రయాణించి సాహసాన్ని ప్రదర్శించాడు. ప్రముఖ పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణతో కలిసి ఎవరెస్ట్ అధిరోహణ కార్యక్రమంలో పాల్గొనడం అతని క్రీడా ప్రస్థానంలో మరో విశేష అనుభవంగా నిలిచింది. తైక్వాండోలో పోటీ తత్వంతో పాటు సాహసం, ధైర్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంలో ఈ అనుభవం ఉపయోగపడింది. ప్రస్తుతం ద్వారక రెడ్డి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) కేంద్రంలో ఉన్నత స్థాయి తైక్వాండో శిక్షణ పొందుతున్నాడు. కోచ్ కె. విట్టల్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో తన ఆటలోని నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటున్నాడు. అంతర్జాతీయ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, భవిష్యత్తులో ఒలింపిక్ పతకం సాధించాలన్నది అతని ప్రధాన లక్ష్యం. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన యువకుడు ఇంతటి లక్ష్యంతో ముందుకు సాగుతుండటం నేటి తరం



విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

**ప్రత్యేక తైక్వాండో శిక్షణ కేంద్రం అవసరం....**

ద్వారక రెడ్డి వంటి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం, అత్యున్నత స్థాయి శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తైక్వాండోలో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలంటే నిపుణులైన కోచ్‌లు, ఆధునిక మౌలిక వసతులు, శాస్త్రీయ శిక్షణ, వసతి సౌకర్యాలు, నిరంతర పోటీ అనుభవం ఎంతో కీలకం. ప్రస్తుతం ఈ సౌకర్యాల కోసం తెలంగాణకు చెందిన క్రీడాకారులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

తెలంగాణలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేక తైక్వాండో హైపెర్ఫార్మెన్స్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోచ్‌లు, తల్లిదండ్రులు, తైక్వాండో అసోసియేషన్లు, క్రీడాభిమానులు కోరుతున్నారు. ఇలాంటి కేంద్రం ఏర్పాటు అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్వరాష్ట్రంలోనే అత్యున్నత స్థాయి శిక్షణ అందే అవకాశం ఉంటుంది. దీంతో ప్రయాణ, శిక్షణ ఖర్చులు తగ్గడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలపై భారం కూడా తగ్గుతుంది. ద్వారక రెడ్డి వంటి యువ ప్రతిభను జాతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ, ఒలింపిక్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం, క్రీడా సంస్థలు, కోచ్‌లు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉంది. సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు లభిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఒలింపిక్ పతక విజేతలు వెలువడే అవకాశం ఉందని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కాజీపేటలో అదనపు రైలు హాల్టులు కల్పించాలి

అక్షరశక్తి, హనుమకొండ: కాజీపేట రైల్వే స్టేషన్‌లో మరిన్ని ముఖ్యమైన రైళ్లకు హాల్టులు కల్పించడంతో పాటు, కోవిడ్19 అనంతరం నిలిపివేసిన రైలు సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు రహమతుల్లా మహమ్మద్ వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. కాజీపేట మీదుగా అనేక ముఖ్యమైన రైళ్లు ప్రయాణిస్తున్నప్పటికీ, కొన్ని రైళ్లకు హాల్టు లేకపోవడంతో వరంగల్-హనుమకొండ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 20833/20834 విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్, 12649/12650 కర్ణాటక సంపర్క్ క్రాంతి, 18111/18112 యశ్వంత్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, 12739/12740 విశాఖపట్నం-సికింద్రాబాద్ గరీబ్ రథ్ రైళ్లకు కాజీపేటలో హాల్టు కల్పించాలని కోరారు.



అదేవిధంగా కోవిడ్ అనంతరం నిలిచిపోయిన కాజీపేట-బెలగావి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర రైలు సర్వీసులను పునరుద్ధరించేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డుపై అవసరమైన స్థాయిలో ప్రతిపాదనలు



చేయాలని ఎంపీ, ఎమ్మెల్యేలను రహమతుల్లా మహమ్మద్ కోరారు.

# విలువలతో జీవించే మనుషులను సమాజంలోకి ఆహ్వానించాలి

- రాఖీ ద్వారా మానవీయ అనుబంధానికి శ్రీకారం
- బీ హ్యూమన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ రేపల్లె నరోత్తం సూరి







**అక్షరశక్తి, హైదరాబాద్, ఆగస్టు 28 :** అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి, ప్రేమాభిమానాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకొని బీ హ్యూమన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ రేపల్లె నరోత్తం సూరి నివాసంలో ఒక ప్రత్యేకమైన మానవీయ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ఇటీవల దండకారణ్య ప్రాంతాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చిన చందర్, ఆయన సతీమణి గంగాను కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా ఇంటికి ఆహ్వానించారు. గంగా తన జీవితంలో తొలిసారిగా కుటుంబ సభ్యులందరికీ రాఖీలు కట్టి, వారితో ఆత్మీయ అనుబంధాన్ని పంచుకోవడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది. గంగా నిరక్షరాస్యురాలు; ఆమెకు పాఠశాల విద్య గానీ, అక్షరజ్ఞానం ద్వారా వచ్చిన అధికారిక విద్య గానీ లేదు. అయితే పుస్తక విద్య లేకపోయినా, జీవితానుభవం ద్వారా ఆమె సంపాదించుకున్న విలువలు, నిబద్ధత, నిజాయితీ, ధైర్యం, మానవీయత ఎంతో గొప్పవని ఈ సందర్భంగా రేపల్లె నరోత్తం సూరి పేర్కొన్నారు. ఒక మనిషి గొప్పతనం కేవలం అతను ఎంత చదువుకున్నాడనే దానిలో కాకుండా, తాను నమ్మిన విలువలను జీవితంలో ఎంత నిజాయితీగా ఆచరిస్తున్నాడనే దానిలో ఉంటుందని ఆయన అన్నారు. ప్రత్యేకంగా గంగా ఇంటర్వ్యూను ఐడ్రీమ్ మురళి ద్వారా వీక్షించిన అనంతరం, ఆమె మాటల్లో వ్యక్తమైన స్పష్టత, నిబద్ధత, తాను నమ్మిన సిద్ధాంతాల పట్ల చూపిన అచంచలమైన విశ్వాసం తమను ఎంతగానో ప్రభావితం చేసిందని నరోత్తం సూరి తెలిపారు. చదువు లేకపోయినా, ఒక వ్యక్తి తన జీవితం ద్వారా నేర్చుకున్న విలువలను అంత నిబద్ధతతో ఆచరించడం నేటి సమాజానికి ఒక గొప్ప సందేశమని ఆయన అన్నారు.

ప్రస్తుత కాలంలో విద్యావంతులుగా, ఉన్నత స్థానాల్లో ఉన్నవారిలో కూడా విలువల సంక్షోభం కనిపిస్తున్న తరుణంలో, అధికారిక విద్య లేకపోయినా నైతిక విలువలను తన జీవితంలో ఆచరణలో చూపిస్తున్న గంగా గారి వంటి వ్యక్తులను సమాజం గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని బీ హ్యూమన్ ఫోరం పేర్కొంది.

ప్రభుత్వాలు పునరావాసం, ఆర్థిక సహాయం, గౌరవంతో పాటు వారిని సాధారణ జనజీవనంలోకి తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాలకు సమాజం కూడా మానవీయంగా తోడ్పడాల్సిన అవసరం ఉందని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు. కేవలం ప్రభుత్వ చర్యలతోనే పునరేకీకరణ పూర్తికాదని, సమాజం కూడా వారిని దూరంగా ఉంచకుండా తమ కుటుంబ, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా వారికి ఆత్మవిశ్వాసం, మానసిక భరోసా, సామాజిక చైతన్యం కల్పించవచ్చని బీ హ్యూమన్ ఫోరం అభిప్రాయపడింది.

"ఒక వ్యక్తి రాజకీయ సిద్ధాంతాలతో మనం ఏకీభవించకపోవచ్చు. కానీ ఆ వ్యక్తిలోని నిజాయితీ, నిబద్ధత, నైతిక విలువలు, మానవీయ గుణాలను గౌరవించడంలో ఎలాంటి సంకోచం ఉండకూడదు" అని నరోత్తం సూరి అన్నారు. అభిప్రాయాలు వేరైనా, మానవీయ విలువల విషయంలో మనుషులను దగ్గరకు తీసుకోవడమే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు మరియు సామాజిక కార్యకర్త అడ్వకేట్ అబ్దుల్ నబీ, జైసింగ్ రాథోడ్, ఇతర సామాజిక ఉద్యమకారులు, కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, విలేకరి మిత్రులు పాల్గొన్నారు. గంగా నైతిక విలువలు, సామాజిక చైతన్యం, నిబద్ధతను గుర్తించిన పలువురు విలేకరి మిత్రులు కూడా ఆమె చేత రాఖీలు కట్టించుకొని ఈ రాఖీ పండుగను మరింత ఆత్మీయంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీ హ్యూమన్ ఫోరం తరపున సమాజానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు: విలువలతో జీవించే ఏ మనిషినైనా అతని గతం, విద్య, నేపథ్యం లేదా రాజకీయ సిద్ధాంతాల ఆధారంగా సమాజానికి దూరం చేయకూడదు. మంచి విలువలను కలిగి ఉన్న వ్యక్తులను గుర్తించి, గౌరవించి, వారిని సామాజిక జీవితంలో భాగస్వాములను చేయాలి.

సమాజంలో ఎవరినీ శాశ్వతంగా దూరంగా ఉంచకుండా, అసమానతలు లేని, ప్రేమాభిమానాలు, పరస్పర గౌరవం, మానవీయ విలువలు, ప్రజాస్వామ్య భావనలతో కూడిన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని బీ హ్యూమన్ ఫోరం పిలుపునిచ్చింది.

ప్రజాస్వామ్య వాతావరణంలో ప్రతి వ్యక్తికి తన అభిప్రాయాలను సమాజంతో పంచుకునే స్వేచ్ఛ ఉండాలని, అదే సమయంలో భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూ మానవీయ సంబంధాలను బలోపేతం చేయాలని కోరింది. "పండుగలు కేవలం మన కుటుంబాలకే పరిమితం కాకుండా, సమాజంలోకి తిరిగి వస్తున్న ప్రతి విలువైన మనిషిని మనతో కలుపుకునే మానవీయ వేదికలుగా మారాలి. ప్రేమ, గౌరవం, ఆత్మీయతతో వారిని మనలో భాగం చేసుకున్నప్పుడే నిజమైన సామాజిక పునరేకీకరణ సాధ్యమవుతుంది" అని నరోత్తం సూరి పేర్కొన్నారు.

## పోలీసుల ప్రత్యేక వాహన తనిఖీలు

- పస్రా–మేడారం రోడ్డుపై పోలీసుల స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**అక్షరశక్తి, గోవిందరావుపేట పస్రా :** పండుగ వాతావరణంలో ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ పస్రా-మేడారం ప్రధాన రహదారిపై పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, డ్రైవింగ్ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు, ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్ సూచనలతో, పస్రా సీఐ పీ. దయాకర్ పర్యవేక్షణలో పస్రా ఎస్సై ఎస్.కె. తాజుద్దీన్, తాడ్వాయి ఎస్సై కె. జగదీష్ గౌడ్, నర్లాపూర్/మేడారం ఎస్సై ఎ. కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు కీలక సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాలతో చెలగాటమని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల వాహనం నడిపే వ్యక్తితో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర వాహన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పస్రా-మేడారం ప్రధాన రహదారిపై చేపట్టిన ఈ ప్రత్యేక వాహన తనిఖీలు ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన కల్పించడంతో పాటు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసుల నిఘా ఎంత కట్టుదిట్టంగా ఉందో స్పష్టం చేశాయి.

## భద్రకాళి చెరువు వరద నివారణ పనులపై సమీక్ష



**అక్షరశక్తి,వరంగల్:** భద్రకాళి చెరువు పరిధిలో చేపట్టాల్సిన వరద నివారణ చర్యలు, ముందస్తు రక్షణ పనులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు నీటి ప్రవాహం, వరద పరిస్థితులు, కాలువలు, నీటి విడుదల మార్గాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరద నివారణ పనులను ముందస్తుగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి వరంగల్ ఆర్డీవో సుమ, ఇరిగేషన్ ఎస్ ఇ రామ్ ప్రసాద్, ఇ ఇ ,కిరణ్ , డి ఇ మధుసూదన్ రెడ్డి, వరంగల్ ఖిలా వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్,ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

- సెప్టెంబర్ 2నుంచి నిరసన కార్యక్రమాలు
- ఏడు రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను జనంలో ఎండగట్టడమే లక్ష్యం
- పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలి
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్



**అక్షరశక్తి, హైదరాబాద్** : కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల అసమర్థ పాలన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, అవినీతి ఆరోపణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి చేపట్టనున్న వారం రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి వరుసగా ఏడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచాలని ఆయన సూచించారు.

ఈ మేరకు పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజులపాటు చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారికి సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వైఖరిని ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజల ముందు ఎండగట్టాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

పార్టీ నిర్ణయించిన కార్యాచరణను కేవలం కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమిటి? వాటిలో ఎన్ని అమలయ్యాయి? ప్రజలకు ఇంకా ఏమేం బాకీ ఉన్నాయి? అనే అంశాలను ప్రతి ఇంటికీ చేరేలా వివరించాలని కేటీఆర్ సూచించారు. ప్రతి నాయకుడు తన కార్యక్షేత్రంలో బాధ్యత తీసుకొని ప్రజలతో మమేకమవుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

వారం రోజుల కార్యాచరణకి ముందుగా సెప్టెంబర్ 1న కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జిషీట్‌ను వేస్తూ భవన్‌లో మీడియా సమావేశం పార్టీ నిర్వహిస్తుందన్నారు. ఆ తర్వాత వరుసగా వారం రోజుల పాటు వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం సెప్టెంబర్ 2న కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని నిరసిస్తూ అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని తెలిపారు. కాంగ్రెస్ చేసిన హామీల మోసాన్ని ప్రతీకాత్మకంగా ప్రజలకు తెలియజేసేందుకు భారీ ఫ్లెక్సీల ప్రదర్శనతో పాటు '420 హామీలు' అంశాన్ని ప్రధానంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇదే సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం ఇంకా బాకీ ఉన్న హామీలను తెలియజేసేలా ప్రత్యేక బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయాలని కేటీఆర్ ఆదేశించారు. సెప్టెంబర్ 3న రైతాంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతులు, వ్యవసాయదారులు, రైతుకూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో రైతు సదస్సులు నిర్వహించాలని తెలిపారు. వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, యూరియా, పంటల బీమా వంటి కీలక అంశాలపై రైతులతో చర్చించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని చెప్పారు.

హైదరాబాద్‌తో పాటు అర్బన్ ప్రాంతాల్లో ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యపై ప్రత్యేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు నిర్వహించాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 4న మహిళలు, వికలాంగులు తదితర వర్గాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడాన్ని ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, తులం బంగారం వంటి అంశాలతోపాటు ఇతర సంక్షేమ హామీల అమలు పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో వినూత్నంగా వంటావార్పు వంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువత సమస్యలపై ప్రత్యేకంగా పోరాట కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, ఉద్యోగాల కల్పనతోపాటు యువతకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో యువతతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ఆదిలాబాద్‌లో సీసీఐ సమస్యలు, సింగరేణి ప్రాంతాల్లో ఆయా వర్గాల సమస్యలపై ప్రత్యేక నిరసన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో ప్రత్యేక ర్యాలీ నిర్వహించాలని కేటీఆర్ తెలిపారు. తాగునీరు, వీధి దీపాలు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బస్తీ దవాఖానాల నిర్వహణ వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. అదేరోజు మిగిలిన నియోజకవర్గాల్లో పల్లెల పరిస్థితి, పడకేసిన పారిశుద్ధ్య వ్యవస్థ, గ్రామీణ ప్రాంతాల సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

సెప్టెంబర్ 7న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తిని వ్యక్తం చేసే వేదికగా ఉపయోగించుకోవాలని కేటీఆర్ సూచించారు. అన్ని జిల్లా, మండల ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యం, ప్రజలకు జరిగిన మోసంపై ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాలని పార్టీ నాయకులను ఆదేశించారు.

వారం రోజుల కార్యక్రమాల అనంతరం సెప్టెంబర్ 8న అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించి, ఆయా జిల్లాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని సూచించారు. అదే సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలని తెలిపారు. సెప్టెంబర్ 10న జరగనున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసన కార్యక్రమాలకు కూడా బీఆర్ఎస్ సంఘీభావం ప్రకటించాలని కేటీఆర్ సూచించారు. పార్టీ చేపట్టనున్న ఈ వారం రోజుల కార్యాచరణను విజయవంతం చేయడంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాలు విస్తృతంగా, ప్రజల భాగస్వామ్యంతో, సాధ్యమైనంత వినూత్నంగా నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలు, అమలు కాని హామీలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ మొత్తం కార్యక్రమాలను పార్టీ కేంద్ర కార్యాలయం ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తుందని కేటీఆర్ తెలిపారు. ప్రతి కార్యక్రమంపై నివేదికలు తీసుకోవడంతోపాటు పార్టీ కేడర్‌ను అప్రమత్తం చేసి నాయకులకు అవసరమైన మార్గదర్శకాలు అందజేస్తామని చెప్పారు. పార్టీ నిర్దేశించిన కార్యాచరణను ప్రతి ఒక్కరూ తమ తమ కార్యక్షేత్రాల్లో విజయవంతం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమిద్దాం..

**సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య**



**అక్షరశక్తి, మహబూబాబాద్** : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల 26వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి హాలవత్ లింగ్యా అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ... 2000 సంవత్సరంలో ఆగస్టు 28వ తేదీన విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపుదల ప్రైవేటు సంస్థల చేతిలో ఉండకూడదని ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నరహంతక నారా చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఉవ్వెత్తున ఉద్యమం కొనసాగుతున్న సందర్భంలో బషీర్బాగ్ వద్ద పాషవికంగా పోలీసులు కాల్పులు జరపడంతో రామకృష్ణ విష్ణువర్ధన్ బాలస్వాములు తీవ్రంగా గాయపడి మరణించడం జరిగిందని తెలిపారు. దానితో ప్రభుత్వం వెనకకు తగ్గి కరెంటు ప్రైవేటీకరణను మానుకుందని తెలిపారు. ఆ ఫలితంగానే ప్రభుత్వం ఆధీనంలో విద్యుత్ వ్యవస్థ ఉందని తెలిపారు. నేడు రాష్ట్రంలో,దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ ప్రయివేట్ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రక్రియ జోరుగా సాగుతుందనో దానికి వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యమ స్పూర్తితో ఐక్య ప్రజా ఉద్యమాలను నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. అదే వారికి అర్పించే ఘణమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా కార్యదర్శి బట్టు చైతన్య, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి బోనగిరి మధు, పి వై ఎల్ ,పి డి ఎస్ యు ప్రజాసంఘాల నాయకులు తెలబోయిన కృష్ణ, షేక్ షబ్బీర్ ఎస్.కె పాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ సర్కార్ శుభవార్త

**అక్షరశక్తి, హైదరాబాద్** : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.

**సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తులు**

సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తులను తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థులకు అవకాశం లభిస్తుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలి.

**గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు**

విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. GRE/GMAT స్కోర్‌తో పాటు TOEFL/IELTS/PTEలో అవసరమైన స్కోర్ సాధించి ఉండాలి. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యం ఉన్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి మంచి అవకాశాన్ని అందిస్తోంది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.